క్లుప్తంగా

10న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ

పెనుమంట్ర: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని 2336 మందికి పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖాధికారి యు.నాగేశ్వరరావు అన్నారు. ఈ నెల 10న పాఠశాలల్లో ఈ మాత్రల పంపిణీపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో విద్యాశాఖ. వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులు,, ఆరోగ్యశాఖ సిబ్బందితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాత్రలు ఏవిధంగా పంపిణీ చేయాలి విధానంపై ఉపాధ్యాయులకు ఆరోగ్యశాఖ సిబ్బందికి డాక్టర్ వి.అనిల్‌కుమార్, డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ ఎస్‌కే సవేర్ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.పూర్ణబాబ్జి, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ పాల్గొన్నారు.

వలంటీర్లకు నియామక పత్రాల అందజేత


వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాల పథకాలను అర్హులైన ప్రతీ పేదవాడికి సక్రమంగా అందజేయడంలో వలంటీర్లు ఎంతో బాధ్యతగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు పట్టణానికి చెందిన వలంటీర్లకు నియామక పత్రాలను శనివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీనివాస్ అందజేసి నూతనంగా నియమితులైన వలంటీర్లకు అభినందనలు తెలిపారు.

డీఎన్నార్ కళాశాలలో గ్రీన్ హౌస్ ప్రారంభం


గ్రీన్ హౌస్‌ను ప్రారంభిస్తునగోటేటి లక్ష్మి

పాలకొల్లు సెంట్రల్: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఏపి అసిస్టెంట్ సెక్రటరీ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ గోటేటి లక్ష్మీ అన్నారు. శనివారం దాసరి నారాయణ రావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థిని గోటేటి లక్ష్మీ ఇచ్చిన లక్ష రూపాయల డొనేషన్‌తో ఏర్పాటుచేసిన గ్రీన్ హౌస్‌ను ఆమె చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ మొక్కలు పరిరక్షణకు ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖలతో సమన్వయాన్ని కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్, డాక్టర్ వర్మ, మైథిలి, అధ్యాపకులు నోబుల్ రాజు, శిరీష తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకుతో అభివృద్ధి


సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంతో గ్రామాల్లో సమస్యల పరిష్కారంతో పాటు, గ్రామాభివృద్ధి జరుగుతుందని మండల వైస్ ఎంపీపీ తోలేటి శ్రీను అన్నారు. శనివారం గడపగడపకూ మన ప్రభుత్వంలో కేటాయించిన రూ.15 లక్షలతో కొఠాలపర్రులో రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఇంటింటికీ నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో కొఠాలపర్రు ఎస్సీ కాలనీలో రహదారి నిర్మాణం సమస్యను స్థానికులు ప్రస్తావించడంతో నిధులు కేటాయించారన్నారు. ఎన్నడూ లేనంత అభివృద్ధి మాజీ మంత్రిశ్రీరంగనాథరాజు ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కాకిలేటి బాపిరాజు, దివి గణపతి పాల్గొన్నారు.

పోడూరు సొసైటీకి అవార్డు

పోడూరు: పోడూరులోని శ్రీ ఆంజనేయ వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) జిల్లా స్థాయిలో ప్రథమస్థానం అవార్డు దక్కించుకుంది. ఏపీలో ఆప్కాబ్ స్థాపించి 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా శుక్రవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి చేతుల మీదుగా సొసైటీ త్రిసభ్యకమిటీ చైర్మన్ రుద్రరాజు శివాజీరాజు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శివాజీరాజు మాట్లాడుతూ గ్రామ రైతుల సహకారం, త్రిసభ్యకమిటీ సభ్యులు, సిబ్బంది కృషితోనే తమ సొసైటీ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అవార్డు పొందడం ద్వారా మరింత ఉత్సాహం, బాధ్యత పెరిగాయన్నారు. అవార్డు అందుకున్న సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పలువురు నాయకులు, చైర్మన్ శివాజీరాజును, సీఈఓ రుద్రరాజు కృష్ణంరాజును సిబ్బందిని అభినందించారు.

పాడి రైతుకు ప్రత్యేక రుణాలు

- కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా సేవలు
- సద్వినియోగం చేసుకోవాలని ప్రచారం


సిద్ధాంతంలో పాడి పశువులు

పెనుగొండ: వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చడమే కాకుండా పాడి రైతుకు అండగా నిలిచి తద్వారా గ్రామాల్లో ఆర్థికాభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో పాడి రైతుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవడానికి రుణాలు అందిస్తుంది. ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పావలా వడ్డీకే రుణాలు అందించి పాడి రైతుకు అండగా నిలవడానికి పశు సంవర్ధక శాఖ ద్వారా ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్నారు. దీంతో పెనుగొండ మండలంలో 12 వేలకు పైగా పాడి పశువులకు రుణాలు అందించడానికి పెనుగొండ పశు సంవర్ధక శాఖ సన్నాహాలు చేస్తుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గేదేలు, ఆవులుతో పాటు కోళ్ల చేపలు పెంపకం దారులు సైతం రుణాలు అందుకోవడానికి అర్హులుగా అధికారులు గుర్తిస్తున్నారు. ప్రతీ పాడి పశువుకు ఒక్కోదానికి రూ. 25 వేల వరకూ దాని నిర్వహణకు పాడి రైతుకు సిబిల్ ఆధారంగా బ్యాంకు నుంచి రుణం అందించనున్నారు. ఈ రుణంతో పశువులను మేపుకోవడం, గడ్డి పెంపకం, పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవడం, షేడ్ నిర్మాణం వంటివాటికి వినియోగించుకోవచ్చు.

ఇలా చేస్తే వెంటనే రుణం

రుణం పొందడానికి పశు సంవర్ధక శాఖ నుంచి పాడి పశువు ఉన్నట్లు ధృవీకరణ పత్రం తీసుకోవాలి. అంతేగాకుండా పాడి రైతుల కుటుంబాలు సెల్ఫ్ హెల్ప్ గ్రూపులు, డ్వాక్రా గ్రూపులు ద్వారా వీటిని ప్రతీ పాడి రైతుకు అందే విధంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వలంటీర్లు, పశువైద్య సిబ్బంది ద్వారా దరఖాస్తులు స్వీకరించి, వాటిని లీడ్ బ్యాంకులో పరిశీలన అనంతరం స్థానిక బ్యాంకుల ద్వారా రుణాలు అందించనున్నారు. ప్రతీ పాడి పశువుకు రూ.25 వేలు గరిష్టంగా ఒక్కో రైతుకు నాలుగు పాడిపశువులకు రూ.లక్ష వరకూ అందించనున్నారు. వడ్డీ ఏడు శాతంగా నిర్ణయించారు. రుణం మొత్తం ఏడాది లోపులో చెల్లించి వారికి మూడు శాతం తిరిగి వారి ఖాతాల్లో జమ చేస్తున్నారు. దీంతో పాడి రైతులకు అండగా ఉండడానికి పశు సంవర్ధకశాఖ కిసాన్ క్రెడిట్ కార్డ్స్‌పై విస్తృత ప్రచారం నిర్వహిస్తుంది.

రైతులు వినియోగించుకోవాలి



రైతులకు చేదోడుగా ఉండడానికి ప్రభుత్వం పాడి పశువులకు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలి. సక్రమంగా చెల్లించిన వారికి కేవలం పావలా వడ్డీకి అందిస్తారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.ప్రమీలా రాణి, సహాయ సంచాలకులు, పశు సంవర్ధక శాఖ

పుంగనూరు అల్లర్ల బాధ్యత చంద్రబాబుదే


చెల్లెం ఆనందప్రకాష్

పాలకొల్లు అర్బన్: చిత్తూరు జిల్లా పుంగనూరులో జరిగిన అల్లర్లు, దాడులకు చంద్రబాబునాయుడు పూర్తి బాధ్యత వహించాలని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు అనుమతి లేకుండా కేవలం అల్లర్లు సృష్టించి రాష్ట్రంలో శాంతి భద్రతలకు పూర్తి విఘాతం కల్పించాలనే దురుద్దేశంతో పోలీసులపైనా, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనా దాడులకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవడం కోసం ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే విధంగా చంద్రబాబు, లోకేష్, పవన్‌కల్యాణ్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. పుంగనూరు అల్లర్లకు బాధ్యులను చట్టప్రకారం శిక్షించాలని ఆనందప్రకాష్ కోరారు.

అధికారం కోసమే దాడులు


పాలకొల్లు గాంధీ బొమ్మల సెంటర్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మంగరాజు

పాలకొల్లు అర్బన్: అధికారం కోసం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పక్కా వ్యూహంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపైనా, పోలీసులపైనా దాడులు చేసి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానటరింగ్ కమిటీ సభ్యులు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. పాలకొల్లు గాంధీబొమ్మల సెంటర్‌లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో చంద్రబాబు టీడీపీ గూండాలతో పోలీసుల పైకి రాళ్లు రువ్వి రాష్ట్రంలో అల్లర్లు సృష్టించడానికి కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. 2024లో అధికారంలోకి తెలుగుదేశం పార్టీ రాదని తేలిపోవడంతో రాష్ట్రంలో అల్లర్లు సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం విమర్శించారు. సమావేశంలో మాలమహనాడు జిల్లా అధ్యక్షుడు బొందా మోహన్‌రావు, మాలమహనాడు పట్టణ అధ్యక్షుడు కోట రత్నరాజు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి


పాలకొల్లు సెంట్రల్: బ్రెస్ట్ ఫీడింగ్ క్యాంపెయిన్‌లో పాల్గొన్న వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది


పెనుమంట్ర: వెలగలవారిపాలెంలో సంపూర్ణ పోషకాహార కిట్లను అందజేస్తున్న దృశ్యం


పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రు సచివాలయం వద్ద సంపూర్ణ పోషణ కిట్లు అందజేస్తున్న దృశ్యం


యలమంచిలి: మేడపాడులో సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేస్తున్న దేగల సూర్యప్రభ

పెనుమంట్ర: వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార పథకాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా గర్భిణులు, బాలింతలు ఆరోగ్యకరమైన పిల్లలకు జన్మనివ్వాలని ఎంపీటీసీ సభ్యురాలు మాంద్రు శాంతకుమారి అన్నారు. శనివారం వెలగలవారిపాలెం గ్రామంలో అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణ పౌష్టికాహార కిట్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని, వాటిని ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడి రాజారెడ్డి, గ్రామ సర్పంచ్ వెలగల సుగుణ తదితరులు గర్భిణులు, బాలింతలకు కిట్లను అందజేశారు.

తల్లిపాలే శిశువుకు బలం

పాలకొల్లు సెంట్రల్: బిడ్డ పుట్టిన నాటి నుంచి ఆరు నెలలు పాటు ఆ బిడ్డకు తల్లిపాలే ఇవ్వాలని శనివారం డాక్టర్ సునీత తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూరా హెల్త్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో తల్లిపాల వల్ల బిడ్డకు కలిగే ఉపయోగాలపై బ్రెస్ట్ ఫీడింగ్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీత మాట్లాడుతూ తల్లి పాలు ఇవ్వడం వల్ల ఆ బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లికి కూడా రొమ్ము క్యాన్సర్, అండాశయ క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి ప్రసన్న, నూరా హెల్త్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ శివ, ఆర్ఎంఓ మూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయకుమారి, సుజాత, ఫాతిమాబి, పద్మావతి, నాగలక్ష్మి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: బిడ్డలకు తల్లిపాలు సంజీవినిలా పనిచేస్తాయని, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రిపాలు పట్టించడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని సచివాలయ కన్వీనర్ రావాడ సతీష్ అన్నారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రు గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామంలో గల నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలింతలు, గర్భిణులకు డా.వైఎస్సార్ పోషణ కిట్లు శనివారం అందజేసి తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను ఆయన వివరించారు. రూ.1100విలువైన పోషకాహార కిట్లను బాలింతలు, గర్భిణులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యాండ్ర ప్రసాద్, కాటంరెడ్డి రామారావు, మిడతాని సీతామహాలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఎస్ఎస్ మల్లేశ్వరి, ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, సురేఖ, ఎం భాగ్యలక్ష్మి, చంద్రకాంత తదితరులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో...

లంకలకోడేరులో వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వరరావు చేతుల మీదుగా బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు. మాజీ ఎంపీటీసీ కర్రి జోగయ్య, ఆరేపల్లి సింహాద్రి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి పాల్గొన్నారు.

ఆగర్రులో...

ఆగర్రు చిట్టివానిగరువు అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ సాకా గంగారత్నం చేతుల మీదుగా వైఎస్సార్ పోషణ కిట్లు అందజేశారు.

మేడపాడులో...

యలమంచిలి: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి మహిళలంతా సహకరించాలని మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ కోరారు. మేడపాడు అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణీలు, బాలింతలకు ఆమె వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు నెల రోజులకు ఒకసారి మూడు కిలోల బియ్యం, రెండు కిలోల రాగిపిండి, కిలో కందపప్పు, కిలో అటుకులు, పావు కిలో వేరుశెనగ చిక్కీ, పావుకిలో ఎండు ఖర్జూరం, పావు కిలో బెల్లం, అర లీటరు పామాయిల్, 5 లీటర్ల పాలు, 25 కోడి గుడ్లు ఇస్తారన్నారు. వీటిని గర్భిణులు, బాలింతలు భుజించడం ద్వారా తల్లీ, బిడ్డల ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మేడపాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు దేగల వెంకటేశ్వరరావు, బాలం హనుమరత్న మహేశ్వరరావు అంగన్‌వాడీ వర్కర్స్ యాదేపల్లి మహాలక్ష్మి, ఇంజేటి శాంతకుమారి, ఆకుమర్తి శాంతి, కత్తుల లక్ష్మి ఆశ వర్కర్లు మత్తే శాంతకుమారి, సాకా ఉషారాణి, కవురు నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు


ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణం పనులు చురుగ్గా జరిగేలా చూడాలని అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం, మంగళగుంటపాలెం అర్బన్ జగనన్న కాలనీ లే అవుట్‌లను ఆయన పరిశీలించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఇల్లు నిర్మిస్తున్నామని ఆయన అన్నారు. తొలుత లక్ష్మణేశ్వరంలో ఉన్న మూడు లే అవుట్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సర్వే, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో మాట్లాడారు. ఇళ్ల నిర్మాణాలకు ఎంత మంది ముందుకు వచ్చారు? మిగిలిన లబ్ధిదారులను కూడా నిర్మాణాలు చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. లక్ష్మణేశ్వరం 3వ లే అవుట్‌కు వెళ్లే దారిమార్గం కోసం 15 సెంట్ల భూమిని కొనుగోలు చేసే ప్రక్రియ ఎంత వరకూ వచ్చిందని తహసీల్దార్ ఫాజిల్‌ను అడిగారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. నియోజకవర్గంలో సుమారు 250 ఎకరాల భూమిని సుమారు 10,800 మంది లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాల కోసం సేకరించామన్నారు. నియోజకవర్గంలో ఉన్న లే అవుట్లలలోని 60శాతం లే అవుట్‌లలతో చురుగ్గా పనులు జరుగుతున్నాయన్నారు. 8 లే అవుట్‌లలో ఇంకా పనులు ప్రారంభించలేదని ఆయన అన్నారు. వెనువెంటనే లే అవుట్‌లను లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలకు అనుకూలంగా తీర్చి దిద్దాలని, మౌలిక వసతులు, సదుపాయాల ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చాలని మంచి సంకల్పంతో ముందుకు వెళుతుంటే ప్రతిపక్షాలు ఆటంకాలు సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. అర్బన్ లే అవుట్‌కు సంబంధించి 150 ఎకరాలు కొనుగోలు చేసి 100 ఎకరాలు ఇళ్ల స్థలాలకు కేటాయించామని అందులో 25 ఎకరాలను మెరక చేశామని పేర్కొన్నారు. మొదటి విడతలో 624 మంది లబ్ధిదారులకు స్థలాలు మంజూరు కాగా 244 మంది నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. వారిలో 53మంది లబ్ధిదారులు నిర్మాణం పూర్తి చేసుకున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, తహసీల్దార్ ఫాజిల్, గృహనిర్మాణ శాఖ డీఈఈ పి.వెంకటేశ్వరరావు, ఏఈఈ ఎంఎస్‌వి రవీంద్ర, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, దొంగ మురళీకృష్ణ, రేవు రాంబాబు, గోరు సత్తిబాబు, మైలాబత్తుల శ్రీను, మత్తే సువర్ణరాజు, వెన్నా మురళీ, పరసా శ్రీను పాల్గొన్నారు.

కాటన్ పార్కు సందర్శన

నరసాపురం రూరల్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఉన్న పార్కును, బస్టాండ్‌ను అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న ఫుట్‌పాత్ వంతెన పనులను శనివారం చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కాలువపై నిర్మించిన ఫుట్‌పాత్ నిర్మాణ పనుల నాణ్యతను గురించి మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పనులకు సంబంధించి ఆయన పలు సూచనలు చేశారు.

దేశంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయి


బాలకృష్ణకు సన్మానం చేస్తున్న దళితనాయకులు

పాలకొల్లు సెంట్రల్: దేశంలో రోజురోజుకూ దళితులపై దాడులు ఎక్కువవుతున్నాయని పివి రావు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్యవరప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక మార్కెటింగ్ యార్డు అతిథి గృహంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పొన్నమండ బాలకృష్ణను ఎంపికైన సందర్భంగా ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యవరప్రసాద్ మాట్లాడుతూ దళితులపై హత్యలు, మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై దాడులు జరుగుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు భూస్వాములకు కొమ్ముకాస్తూ దళితులను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాటి పెద్దిరాజు, కొర్రపాటి వీరాస్వామి, గోడి పెద్దిరాజు, దేవ రాజేష్, బుంగా జయరాజు, నేలపాటి రాజబాబు, ఇంజేటి కుమార్‌స్వామి, పనమట నాగబాబు, చేరుగొండి పద్మ కిషోర్, వడ్లమూడి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

28న నరసాపురం అర్బన్ బ్యాంక్ మహాజన సభ

నరసాపురం రూరల్: నరసాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ మహాజనసభ ఈ నెల 28వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని సొసైటీ బ్యాంకు కార్యదర్శి కేశవాచార్యులు శనివారం విలేకరులకు తెలిపారు. బ్యాంకు చైర్మన్ ద్వారా హేమకుమార్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో 2022–2023 సంవత్సరం ఆడిట్ రిపోర్టు ఆమోదం, తదుపరి ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ ఆమోదించడం గురించి తీర్మానాలు ఉంటాయన్నారు.



ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


శేరేపాలెంలో రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ అనిలకుమారి


వడలిలో పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ స్పందన

మొగల్తూరు: రైతులు తాము పండించిన పంటను తప్పనిసరిగా ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏడీఏ అనిలకుమారి సూచించారు. శనివారం శేరేపాలెం పంచాయతీ నవుడూరు గరువులో ఏర్పాటు చేసిన పొలం బడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ క్రాప్ నమోదు రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, వరి పంటే కాకుండా రైతు పండించే అన్ని పంటలను నమోదు చేయించుకోవాలన్నారు. ఈ క్రాప్ నమోదు కారణంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పంట నష్టం, వడ్డీ రాయితీ తదితర ప్రయోజనాలు పొందవచ్చున్నారు. రైతులు ఎరువులు, పురుగుమందులు విరివిగా వినియోగించవద్దని రైతులకు సలహాలు సూచనలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. తాము కూడా ప్రతీ వారం గ్రామాల్లో పర్యటించి పొలం బడి కార్యక్రమం ద్వారా రైతులకు సూచనలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అబ్దుల్ రహీమ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పొలంబడితో ఖర్చు ఆదా

పెనుగొండ: పొలంబడి కార్యక్రమం ద్వారా సాగుఖర్చు ఆదా చేయడానికి అవగాహన కల్పిస్తున్నామని మండల వ్యవసాయాధికారి పి.స్పందన తెలిపారు. వడలిలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్సార్ పొలం బడి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు బ్యాలెట్ పేపర్ పరీక్ష నిర్వహించారు. రైతులకు ఎప్పటికప్పుడు సూచనలు చేయడానికి ప్రతీ వారం పొలంబడి నిర్వహిస్తున్నట్లు వివరించారు. రైతులు తక్కువ ఖర్చుతో ఆరోగ్యమైన పంటతో మేలైన దిగుబడులు పొందడానికి పాటించాల్సిన పద్ధతులు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న పంట దశలో ఆశించే పురుగులు, తెగుళ్లను గమనించి పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గా భవాని, వీఏఏలు వర్మ ప్రసాద్ రెడ్డి, ఐసీ అసిస్టెంట్ బాబులు, వీఆర్ఓ నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే విద్వేషాలను రెచ్చగొడుతున్నారు


కుంచలపల్లి విన్‌స్టన్‌బాబు

పోడూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో టీడీపీ అధినేత చంద్రబాబు విద్వేషాలు రెచ్చగొడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా యూత్ అధ్యక్షులు కుంచలపల్లి విన్‌స్టన్ బాబు విమర్శించారు. కవిటంలో గ్రామంలో శనివారం ఆయన మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటనలో టీడీపీ కార్యకర్తలు పోలీసులపై, వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై రాళ్లదాడికి పాల్పడిన ఘటనను తీవ్రంగా ఖండించారు. రాజకీయ స్వార్థం కోసం చిల్లర రాజకీయాలు చేయడం, అల్లర్లు, విద్వేషాలు సృష్టించడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్యన్నారు. ఇకనైనా చంద్రబాబు ప్రజలను రెచ్చగొట్టే రీతిలో విద్వేషకరమైన, ఉన్మాదపూరితమైన ప్రసంగాలు మానుకోవాలని హితవు పలికారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామివారిని అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ఆవరణలో నిర్వహించారు.